క్లుప్తంగా

10న మద్దిలేటి స్వామి కల్యాణోత్సవం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామ శివారులో (జాతీయ రహదారి) పక్కన మునిస్వామి మిట్టపై వెలసిన ఆది చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వాముల వారి దేవాలయంలో శ్రీలక్ష్మి సమేత మద్దిలేటి స్వాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూజారి మునిస్వామి ఆశీస్సులతో నరసింహ స్వామి జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో ఉదయం 11:45 గంటలకు గణపతి పూజ, పుణ్యాహావచనం, ఉత్సవమూర్తులకు విశేష ద్రవ్యములచే అభిషేకం, గణపతి హోమం, సుదర్శన హోమం నిర్వహిస్తారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత మద్దిలేటి స్వామి కల్యాణం జరిపిస్తారు. మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం 12 గంటలకు గ్రామ పెద్దలు, భక్తాదులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు గ్రామోత్సవం, రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అఖండ భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బ్రాహ్మణదొడ్డిలో రీ సర్వే పనులు ప్రారంభం

సి.బెళగల్: మండలంలోని బ్రాహ్మణదొడ్డి రెవెన్యూ పరిధి భూముల రీ సర్వే పనులను ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం గురువారం ప్రారంభించారు. గ్రామ పరిధిలో 7,522.73 ఎకరాల భూవిస్తీర్ణం ఉండగా ప్రభుత్వ భూమి 110.39 ఎకరాలుగా ఉందని అధికారులు తెలియజేశారు. గ్రామంలో 170 బ్లాక్స్‌లలో ఆరు బృందాలుగా బ్రాహ్మణదొడ్డి రెవెన్యూ గ్రామాలకు చెందిన సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, పోలకల్ గ్రామాలు, గూడూరు మండలంలోని జూలకల్లు, చనుగండ్ల, కోడుమూరు మండలంలోని పులకుర్తి గ్రామాలకు చెందిన 975 సర్వే నెంబర్లుగా ఉన్న భూములను రీ సర్వే చేస్తారని అధికారులు తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పిస్తాం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కల్లూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పిస్తామని ఏపీఓ రమాదేవి అన్నారు. గురువారం కె.మార్కాపురంలో జరుగుతున్న ఫారంపాండ్ పనులను ఆమె పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. నిర్దేశిత కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం వస్తుందన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని ఉదయం త్వరగా వచ్చి పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో డోలోత్సవం

కల్లూరు: కల్లూరులోని అమ్మవారి శాలలో గురువారం వాసవీ మాత జయంతి, డోలోత్సవం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోండి


విద్యార్థికి కేకు తినిపిస్తున్న గ్రంథాలయాధికారి

గడివేముల: వేసవిలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటల్ ప్రోగ్రాంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంధాలయాధికారి వెంకటేశ్వర రెడ్డి సూచించారు. సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం కరిష్మా అనే విద్యార్థి పుట్టినరోజు వేడుకలను గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు గ్రంథాలయంలో పుస్తకాలు చదివించడం, చెస్, గేమ్స్ ఆటలు, పాటలు వంటివి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ-హాస్పిటల్ అప్లికేషన్‌పై శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెక్ట్స్‌జెన్ ఈ-హాస్పిటల్ అప్లికేషన్‌పై గురువారం వైద్యులు, పీజీలకు శిక్షణ ఇచ్చారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో నిర్వహించిన ఈ శిక్షణను ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీరాములు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఈ -హాస్పిటల్ అప్లికేషన్‌ను నెక్ట్స్‌జెన్ ఈ-హాస్పిటల్‌గా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇది రోగి రిజిస్ట్రేషన్, అడ్మిషన్, క్లినికల్ డేటా రికార్డింగ్‌తో సహా ఆసుపత్రి కార్యకలాపాలు, వివిధ అంశాల నిర్వహణను కూడా సులభతరం చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీఎంఓలు, పీజీలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సీఎస్ఆర్ ఎంఓ డాక్టర్ బీవీ రావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ ఎంవీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వాహన రాకపోకలు పునరుద్ధరించండి


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడిడ


నేల కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: కర్నూలు నగర శివారులో ఔటర్ రింగ్ రోడ్డు కింద చెన్నై నుంచి సూరత్ నేషనల్ హైవే సొరంగం పనులు చేస్తుండగా గురువారం సాయంత్రం నేల అకస్మాత్తుగా కుంగి పెద్ద గొయ్యి ఏర్పడింది. రోడ్డు పక్కనే గొయ్యి ఏర్పడటంతో జాగ్రత్త చర్యగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. వాహనాలను ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా మళ్లించడంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంట ఉన్నారు.

● జాతీయ రహదారి రోడ్డును ఆనుకుని నేల కుంగడంతో విషయం తెలుసుకున్న కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పోలీసుల సహకారంతో ట్రాఫిక్‌ను మళ్లించారు.

నేటి నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవ స్వాముల వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలలో భాగంగా 9వ తేదీన రాత్రి గణపతి పూజ, స్వస్తి వాచనం, అంకురారోహణం, మృత్సంగ్రహణం, పంచపాలకారాధన, ధ్వజారోహణం, పటాధివాసం, భేరి మృదంగ నాదం, తెల్లవారు జామున 5.20 గంటలకు స్వాముల వారి కల్యాణోత్సవం జరుగుతుందని వెల్లడించారు. అలాగే 10వ తేదీన ఉదయం, సాయంత్రం పూజలు, దేవయాగం, బలిహరణం పూజలు ఉంటాయన్నారు. ఉదయం 6 గంటలకు శేషవాహనం, సాయంత్రం 6 గంటలకు హనుద్వాహనము ద్వారా ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తారని చెప్పారు. 11వ తేదీన ప్రాతఃకాల అర్చన, హోమం, బలిహరణం, సాయంత్రం 6 గంటలకు ప్రభోత్సవం, గరుడోత్సవం నిర్వహిస్తారు. 12వ తేదీన సాయంత్రం దీక్షాహోమం, బలిహరణ, రథాంగహోమం 5.30 గంటలకు స్వాముల వారి రథోత్సవం, 13న ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం చూర్ణస్నపనం సాయంత్రం పూర్ణాహుతి పారువేట కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

● శుభ కార్యం

సి.బెళగల్: మండల కేంద్రంలోని తెలుగువీధిలో గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీనివాసులు కుమారుడు దస్తగిరి వివాహ వేడుకలో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు. గ్రామానికి చేరుకుని శ్రీ రంగనాథ ఆలయ ప్రాంగణంలో జరిగిన పెళ్లి వేడుకలలో వధూవరులను ఆశీర్వదించారు.

● కోడుమూరు రూరల్: డాక్టర్ తులసీదాసు మనువరాలు నందిని, శరత్‌కుమార్‌ల వివాహ వేడుకలో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్ రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

గడివేముల: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏఓ హేమసుందర్ రెడ్డి సూచించారు. గురువారం గని గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభ నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో తొలకరి వర్షాలకు ముందు నవధాన్యాల సాగు చేపట్టడంపై రైతులకు అవగాహన కల్పించారు. మండలానికి 1027 కౌలు కార్డులు మంజూరైనట్లు తెలిపారు. అర్హత కలిగి పొలంలేని రైతులు స్థానిక రైతు సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకానికి విధివిధానాలు వచ్చాయన్నారు. అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి తమ పంట పొలం వన్‌బి, ఆధార్ కార్డు, పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డుతో అనుసంధానమైన ఫోన్ నంబరును అందజేయాలన్నారు. అలాగే మండలానికి 696 మట్టి నమూనాలు మంజూరయ్యాయని, ఆయా గ్రామంలో మట్టి నమూనాలు సేకరిస్తున్నామన్నారు. భూసార పరీక్షల అనంతరం ఏ పంటకు ఎంత ఎరువులు వేయాలో రైతులకు తెలియజేస్తామన్నారు.

గడ్డివామి దగ్ధం


కాలిపోతున్న గడ్డి వామి

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామంలో గడ్డివాము అగ్నికి ఆహుతి అయ్యింది. గ్రామానికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి దాదాపు రూ.లక్షన్నర విలువ చేసే పశుగ్రాసాన్ని కల్లం దొడ్డిలో నిలువ చేసుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి గడ్డివామి నుంచి మంటలు రావడం గమనించిన స్థానికులు పోలీస్‌లకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేలోపే పూర్తిగా కాలిబూడిదైంది.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండను లాగుతున్న వృషభాలు

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో మారెమ్మ, సవారమ్మ దేవర ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో 24 జతల ఎద్దులు పాల్గొనగా కర్నూలు మండలం బి.తాండ్రపాడు వరలక్ష్మి వృషభాలు విజేతగా నిలిచాయి. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వెంకటసాయి భవితరెడ్డి వృషభాలు 2వ, మంత్రాలయం తాయమ్మ వృషభాలు 3, కంచుపాడు వడ్డెమాను ఆంజనేయరెడ్డి వృషభాలు 4, వెంకటగిరి శేషాంక్, శ్రేయ వృషభాలు 5, పసుపుల, యాడికి వృషభాలు 6, రాయచూర్ అభిషేక్, జమ్మన్న వృషభాలు 7, వెంకటగిరి శేషాంక్, శ్రేయ వృషభాలు 8, దైవందిన్నె లక్ష్మీనరసింహ వృషభాలు 9వ స్థానాల్లో నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3వేల చొప్పున దాతల సహకారంతో నిర్వాహకులు అందజేశారు.

ఘనంగా చిన్మయానంద జయంతి

కర్నూలు కల్చరల్: పూజ్య స్వామి చిన్మయానంద మహారాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వీఆర్ కాలనీలోని చిన్మయానంద ప్రభావళిలో జరిగిన వేడుకల్లో చిన్మయ బాలల సంస్కార సాధనా శిబిరంలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి సందేశమిచ్చారు. ప్రపంచ శాంతి కోసం, ఆధ్యాత్మిక పెంపుదలకు, హిందూ ధర్మ పరిరక్షణకు చిన్మయ మహారాజ్ ఎంతో కృషి చేశారన్నారు. దాన్ని కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ భగవద్గీత పుస్తకాలను అందజేశారు. మిషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రుని తిరునాల

వెల్దుర్తి: మండలంలోని ఎల్ నగరం గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 44వ తిరునాల ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం వెంకటస్వామితాత 4వ ఆరాధనోత్సవం అనంతరం గురువారం పూజారి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో గణపతి, శ్రీరాములు వారు, వీరబ్రహ్మేంద్రస్వామి పటాలతో ప్రభోత్సవం వైభవంగా జరిగింది. ఆలయం నుంచి నందికోలసేవతో ప్రారంభమై చెన్నకేశవ స్వామి ఆలయం వరకు సాగింది. ఆనవాయితీగా దేశాయ్ కుటుంబ సభ్యులు వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి తొలినైవేద్యం అందించారు.

నేడు బండలాగుడు, పరుగుపందెం పోటీలు..

ఉత్సవాల సందర్భంగా పాలపండ్ల వృషభాలకు బండలాగుడు పోటీలు శుక్రవారం నిర్వహించనున్నారు. విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు బహుమతులందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే పరుగు పందెం విజేతలకు వరుసగా రూ.3వేలు, 2వేలు, వెయ్యి నగదు బహుమతి అందజేస్తామన్నారు.

డిగ్రీ, బీఈడీ ఫలితాలు వెల్లడించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ఒక ప్రకటనలో కోరా రు. వర్సిటీ అధికారుల అలసత్వంతో వందలాది మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వర్సిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్‌పై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

చిన్నపాటి వర్షానికే రోడ్డుపై మడుగు


పాణ్యం బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు

● నీరు వెళ్లేందుకు కాల్వ తీయని హైవే అధికారులు
● పాణ్యం బ్రిడ్జి కింద నీటిలో వాహనదారుల అవస్థలు


రహదారిపై నిలిచిన నీరు

పాణ్యం: హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని హైవే బ్రిడ్జి వద్ద వర్షపు నీరు వెళ్లేందుకు కాల్వ ఏర్పాటు చేయకపోవడంతో చిన్నపాటి వానకే నీటి నిల్వ చేరుతోంది. ఈ క్రమంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బ్రిడ్జి కింద నీటి నిల్వ చేరింది. ఈ బ్రిడ్జి కింద నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే వర్షపు నీరు నిల్వ ఉన్న కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటుఇటు రోడ్డు ఎత్తులో ఉండటంతో బ్రిడ్జి కింద నీరు అలాగే ఉండిపోతుంది. బైక్, ఆటోలు, కాలినడకన వెళ్లే ప్రజలు ఈ నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైవే అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పనులు పెండింగ్‌లో ఉంచడంతో ఈ ఇబ్బందులు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని నీరు వెళ్లేందుకు కాల్వలు తవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

సంచార చికిత్స కేంద్రం తనిఖీ


గర్భిణుల ఆరోగ్య వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య నోడల్ అధికారి రఘు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామ బీసీ కాలనీలో గురువారం నిర్వహిస్తున్న సంచార చికిత్స కేంద్రాన్ని జిల్లా వైద్య నోడల్ అధికారి రఘు తనిఖీ చేశారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులతో ఆయన మాట్లాడారు. కచ్చితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవించాలని సూచించారు. రక్త హీనతతో బాధ పడుతున్న వారు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పుట్టిన శిశువుకు ముర్రు పాలు తాపాలన్నారు. బిడ్డకు బిడ్డకు ఎడం పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాఘవ, ఆరోగ్య కార్యకర్త భీమేశ్వరి, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుండా సమావేశాలెందుకు?


సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు


సభను బహిష్కరించి బయట ఉన్న ప్రజా ప్రతినిధులు

● సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ప్రజా ప్రతినిధులు

గడివేముల: గత మండల సర్వసభ్య సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలను పరిష్కరించకపోవడంతో గురువారం జరిగిన సమావేశాన్ని ప్రజాప్రతినిధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మలతో పాటు ఎంపీటీసీలు మాట్లాడుతూ.. మండలంలోని సమస్యలు పరిష్కారం కానప్పుడు మండల సర్వసభ్య సమావేశం ఎందుకని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ కార్యక్రమాలు నిర్వహించరాదని ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని, దాన్ని లెక్కచేయకుండా అధికారులు ఏప్రిల్ 1న పదో తరగతి పరీక్షల సమయంలో పాఠశాలలో ఆర్కెస్ట్రా నిర్వహించడం సరైనది కాదన్నారు. గడివేములలో శ్మశాన వాటిక సమస్యను గత మూడు సర్వసభ్య సమావేశాలలో అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదన్నారు. మండలంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. మంచాలకట్ట గ్రామంలో పొలాలకు వెళ్లేందుకు రస్తాలు ఏర్పాటు చేయాలని, చెరువు కట్ట వద్ద కంపచెట్లు తొలగించి కట్ట కుంగకుండా భద్రత కల్పించాలన్నారు. గత మూడు నెలల నుంచి ఎంపీటీసీలకు జీతాలు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయి అధికారులు సర్వసభ్య సమావేశం జరిగే రెండు గంటల ముందు మాత్రమే ప్రజా ప్రతినిధులకు తెలియజేస్తున్నారన్నారు. గ్రామాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, దీనిపై ప్రతి సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో ఉండే సమస్యలను తెలియజేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అందుకే సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేసి వెళ్లిపోవడంతో సమావేశం వాయిదా పడింది. ఎంపీటీసీలు వంగాల మహేశ్వర రెడ్డి, రమాదేవి, సైమన్, రామస్వామి, మద్దమ్మ, శ్రీనివాస రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు

గూడూరులో చోరీ

● 4తులాల బంగారం, 10 తులాల వెండితో ఉడాయించిన దుండగులు


బాధితుడి ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

కోడుమూరు రూరల్: గూడూరులోని రాజవీధిలో నివాసముంటున్న మోహన్ ఇంట్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 4 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలను మూటగట్టుకుని ఉడాయించారు. బాధితుడు తెలిపిన వివరాలు.. మోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళాలు వేసి అనంతపురం జిల్లా యాడికికి బుధవారం వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి దాటిన తర్వాత తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాను రాడ్‌తో పెకిలించి ఆభరణాలతో ఉడాయించారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసిన చుట్టుపక్కల గురువారం మోహన్‌కు సమాచారం ఇచ్చారు. అతడు గూడురు చేరుకుని చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

సమావేశ భవనం ప్రారంభం


నూతన సమావేశ భవనాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

కోడుమూరు రూరల్: గూడూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మించిన సమావేశ భవనాన్ని గురువారం వైద్యాధికారులు డాక్టర్ నాగప్రసాద్, డాక్టర్ షఫియా బేగం, డాక్టర్ ప్రత్యూష ప్రారంభించారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆర్థిక సహకారంతో నూతనంగా సమావేశ భవనాన్ని నిర్మించుకున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామక్రిష్ణ, క్రిష్టారెడ్డి, రాఘవయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?

● ప్రభుత్వంపై వ్యతిరేక వార్తలు ప్రచురిస్తే వేధిస్తారా?
● సాక్షి ఎడిటర్ ఇంట్లో పోలీసు సోదాలపై జర్నలిస్టు సంఘాల నిరసన


డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న పాణ్యం జర్నలిస్టులు

పాణ్యం: కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాయడం, ప్రచురించిన వారిపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేయడం తగదని పాణ్యం జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి కేసు నమోదు చేయడం, ఎలాంటి అనుమతులు లేకుండా గురువారం విజయవాడలోని ఆయన ఇంట్లోకి చొరబడి సోదాల పేరిట దౌర్జన్యం చేయడం, ఎందుకని ప్రశ్నిస్తే ముద్దాయిలు ఇంట్లో ఉన్నట్లు సమాచారం ఉందని బదులివ్వడం పత్రిక స్వేచ్ఛను హరించడమేనన్నారు. పోలీసు దౌర్జన్యాన్ని నిరసిస్తూ మండలంలోని జర్నలిస్టులు డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు ప్రచురిస్తే కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా వార్తలు ప్రచురిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చన్నారు. ప్రెస్ కౌన్సిల్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతేగానీ ఎడిటర్లపై కేసులు నమోదు చేయడం, ఇళ్లలోకి వెళ్లి దౌర్జన్యం చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని విమర్శించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటున్న జర్నలిస్టులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు. యావత్తు జర్నలిస్టు వ్యవస్థనే అవమానించేలా కూటమి పాలకులు వ్యవహరించారని, వారికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. పాణ్యం జర్నలిస్టులు ఎ.బాలకంబయ్య, రమేష్, రవి, అప్సర్, నబిఉసేన్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు (టౌన్): క్రీడలతో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న అన్నారు. గురువారం కళాశాల క్రీడా ప్రాంగణంలో నగరపాలక సంస్థ, స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం సంయుక్త ఆధ్వర్యంలో తైక్వాండో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. చిన్నారులు తైక్వాండో విన్యాసాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, న్యాయవాది శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.